# నా జీవన జ్యోతి ఇస్లాం



ఎస్.కె.జమీలా

**నా** పేరు జమీల. నేను ఇస్లాం స్వీకరించకముందు నా పేరు జ్యోతి. మాది చిత్తూరు జిల్లాకి చెందిన పచ్చనపల్లి గ్రామం. మా కుటుంబ సభ్యులు హిందు మతాన్ని అవలంబిస్తుండేవారు. మాది మధ్య తరగతి కుటుంబం. మా దగ్గరి బంధువుల అబ్బాయితో నా వివాహం జరిగింది. వరకట్న వేధింపుల కారణంగా పెళ్ళి అయిన 3 నెలలకే విడిపోవలసివచ్చింది. నా తల్లి దండ్రులు, మా బంధువులు నాకు నచ్చజెప్పటానికి ప్రయత్నించారు. నాకు ఇష్టం లేనందువల్ల కువైట్‌కి వచ్చేశాను. నేను కువైట్‌కి వచ్చి ఇంట్లో పని చేస్తుండేదాన్ని, కొద్ది రోజుల తరువాత పరదా పాటించాల్సిన అవసరం నాకు ఎంతైనా ఉందన్న ఆలోచన కలిగింది. ఆ తర్వాత ఇస్లాంను అధ్యయనం చేయసాగాను. చివరకు మా మేడమ్ సహాయంతో IPC కి వెళ్ళి తెలుగు ఉపాధ్యాయులు అయిన ముహమ్మద్ బిలాల్ గారి ద్వారా ఇస్లాం స్వీకరించాను. ప్రతివారం IPC కి వెళ్ళి ఇస్లాం గురించి తెలుసుకోగలిగాను.

ఇస్లాం స్వీకరించిన కొద్ది రోజులకే నా కష్టాలు మరింతగా పెరిగాయి. నాకు కష్టాల్ని ఎదుర్కొనే దృఢత్వాన్ని ప్రసాదించమని నాకు ఉత్తముడైన నీ దాసునితో నికాహ్ జరిపించమని అల్లాహ్ త ఆలాను దుఆ చేసేదాన్ని.

అల్లాహ్ నా మొరను ఆలకించి, నన్ను బానిసత్వం నుండి విముక్తి చేసి ఉత్తముడైన వ్యక్తితో నికాహ్ జరిపించాడు. అల్‌హమ్దులిల్లాహ్ మంచి సంతానాన్ని ప్రసాదించాడు. ఇప్పుడు నా జీవనరథం ధర్మపథంలో నడుస్తోంది. ఈ విషయాలన్ని ఎందుకు తెలియజేస్తున్నానంటే దృఢమైన విశ్వాసం కలిగిన తన దాసులని అల్లాహ్ తఆలా తన కరుణా కటాక్షాలతో ఉన్నత స్థాయిని ప్రసాదించి ఇహపరలోకాల సాఫల్యం కలుగజేస్తాడు **"ఎవరైతే అల్లాహ్‌కు భయపడుతూ ఉంటాడో అల్లాహ్ అతనికి (కష్టాల నుండి) గట్టెక్కే పరిస్థితులను కల్పిస్తాడు. అతను ఊహించనయినా లేని చోటి నుంచి అతనికి ఉపాధిని వొసగుతాడు"** (తలాఖ్ : 2,3)

అంతే కాదు, అటువంటి దైవభక్తి పరాయణుల తప్పిదాలను అల్లాహ్ మన్నిస్తాడు. వారి లోపాలపై తెరవేస్తాడు. జనబాహుళ్యంలో వారి వ్యక్తిత్వాన్ని ఇనుమడింపజేస్తాడు. మట్టిలో మాణిక్యంలా మెరిసే మంచిరోజులను తెస్తాడు అందుకే ప్రతి వ్యక్తీ దృఢమైన విశ్వాసంపై స్థిరంగా ఉండి, అల్లాహ్ సహాయం కోసం అర్థించాలని కోరుతూ మనందరినీ దృఢమైన విశ్వాసంపై ముందుకు నడిపించాలని అల్లాహు త ఆలాను దుఆ చేస్తున్నాను.

## నా సందేశం

ముఖ్యంగా ముస్లింలైన నా అక్కాచెల్లెళ్ళందరికీ నేను ఒక మనవి చేసుకోదలిచాను- అల్లాహు త ఆలా మనందరికీ ఇస్లాం మరియు ఈమాన్ మధురిమను ఆస్వాదించే భాగ్యం ప్రసాదించాడు. ఉమ్మతె ముస్లిమాలో మనం సగభాగం అన్న సంగతి మరువరానిది. అందుకే మనం మంచిని పెంచే, చెడులను అరికట్టే పనుల్లో మన వంతు కర్తవ్యాన్ని నిర్వర్తించాలి.

అలాగే అల్లాహ్‌ను, అల్లాహ్ ప్రవక్తను, అంతిమ దినాన్ని విశ్వసించే స్త్రీలు తమ సాటి సోదరీమణులను ఆదరించాలి. ఆస్తీ అంతస్తుల ఆధారంగా, వంశం, వర్ణం ఆధారంగా కాకుండా తఖ్వా (దైవభీతి, మంచితనం) ఆధారంగా సాటి మహిళలను ప్రేమించాలి. హృదయంలో ఈమాన్ (విశ్వాసం) బీజం నాటుకున్న వారిని చిన్నచూపు చూడరాదు. వారిని గేలి చేయరాదు. ఏమో!? భయభక్తుల రీత్యా అల్లాహ్‌కు ఎవరు ఎక్కువ ప్రియతములో మనకేం తెలుసు!? ముస్లిం సమాజంలో ఇలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకూడదనే అల్లాహ్ ఈ విధంగా ఆజ్ఞాపించాడు:

"ఓ విశ్వాసులారా! పురుషులు ఇతర పురుషులను ఎగతాళి చేయకూడదు. వీరికంటే వారే శ్రేష్ఠులై ఉండవచ్చు. అలాగే (విశ్వసించిన) స్త్రీలు ఇతర స్త్రీలను ఎగతాళి చేయకూడదు. (ఎగతాళి చేసే) వీరికంటే (ఎగతాళి చేయబడే) వారే ఎక్కువ ఉత్తములై ఉండవచ్చు. ఒకరి కొకరు ఎత్తి పొడుచుకోకండి. విశ్వసించిన తర్వాత చెడ్డతనంలో పేరు సంపాదించటం చాలా నీచమైన విషయం. ఈ వైఖరిని మానుకోని వారే దుర్మార్గులు." (అల్ హుజురాత్ - 11)

ఈ లోకం అశాశ్వితం. ఏ కణంలో ఇక్కడ మన నూకలు చెల్లుతాయో ఎవరికెరుక? మన వంశపరంపర గానీ, మన ఆస్తీ అంతస్తులుగానీ దైవసన్నిధిలో మనకు పనికి రావు. మన యందలి తఖ్వా మరియు సత్కార్యాలే మనకు పనికి వచ్చేది. కాబట్టి మన దృష్టి ఎక్కువగా ఈమాన్ మరియు అమలె సాలెహ్‌పై ఉండాలి. అల్లాహు తఆల మనందరి జీవితానికి మంచి ముగింపును ప్రసాదించుగాక! (ఆమీన్)